

• మామిడిపల్లిలో వేసిన అయోధ్య మందిరం ముగ్గు

ఘనంగా సంక్రాంతి వేడుకలు

• జిల్లాలో అంబరాన్నంటిన సంబురాలు • ఆకట్టుకున్న రంగవల్లులు, గొబ్బెమ్మలు • ఎగిరిన గాలిపటాలు • ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జిల్లా వ్యాప్తంగా మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పల్లె ముంగిట పాడి పంటలు.. ఇంటింటా భోగి మంటలు.. వాకిళ్లలో రంగవల్లులు.. వంటిళ్లలో పిండివంటలు.. డూడూ బసవన్నల విన్యాసాలు.. హరిదాసు కీర్తనలతో సంస్కృతీ సౌరభాలు కొలువుదీరాయి. బొమ్మల కొలువు, భోగి పళ్లు, భోగి మంటలతో జిల్లా వాసులు సంబరాల్లో మునిగితేలారు. సంక్రాంతి వేడుకలు పురస్కరించుకుని గ్రామాల్లో ఎద్దులను ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. పండుగను పురస్కరించుకుని పలు ఆలయాల్లో కల్యాణ వేడుకలు, హోమాలు జరిపారు. గాలిపటాలు ఎగరేయడంలో యువత బిజీబిజీగా గడిపారు. తోటి స్నేహితులతో కలిసి డాబాలపై డీజే సౌండ్‌ల మధ్య ఆటపాటలతో గాలిపటాలను ఎగురవేస్తూ సందడి చేశారు.

\- నిజామాబాద్ అర్బన్/న్యూస్ నెట్‌వర్క్





• ధర్మారం(బి)లో..

• డొంకేశ్వర్‌లో..



• ఇందల్వాయిలో..

• సాలూరలోని పంట పొలాల్లో రైతుల పూజలు



• నగరంలో..







• ముప్కాల్‌లో గాలిపటాలను ఎగురవేస్తున్న చిన్నారులు



• నవీపేటలో సంక్రాంతి సందర్భంగా పాలు పొంగిస్తున్న దృశ్యం







విద్యుత్ శాఖలో వెక్కిరిస్తున్న ఖాళీలు!

- జిల్లాలో ఏఎల్‌ఎం, జేఎల్‌ఎం, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలు
- సబ్‌స్టేషన్‌లలో ఆపరేటర్ల కొరత
- నలుగురు ఉండాల్సిన చోట ఇద్దరు, ముగ్గురే
- భర్తీచేయాలని ఆపరేటర్ల వేడుకోలు

సుభాష్‌నగర్, జనవరి 16: టీఎస్‌పీడీసీఎల్ ట్రాన్స్‌కోలో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగులను నింపకపోవడంతో సరిపడా ఉద్యోగులు లేక ఉన్నఉద్యోగులపై అదనపు భారంపడుతోంది. ముఖ్యంగా టీఎస్ ఎన్‌పీడీసీఎల్‌లో ఉద్యోగుల నియామకాలు లేకపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం, ఎల్‌ఎం తదితర ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయి. సరిపడా ఉద్యోగులు లేకపోవడంతో ఉన్న ఉద్యోగులపై భారం పడుతుంది. ముఖ్యంగా సబ్ స్టేషన్‌లలో ఆపరేటర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. నలుగురు ఉండాల్సిన ఆపరేటర్లు ఇద్దరు లేదా ముగ్గురు ఉండడంతో వారిపై బారం పడుతోంది. వీరితో పాటు జేఎల్‌యం తదితర ఉద్యోగులపై సబ్‌స్టేషన్‌ల పనిబారం పడుతోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 410కిపైగా అసిస్టెంట్ లైన్‌మెన్ ఖాళీలు ఉన్నాయి. జేఎల్‌ఎం నుంచి ఏఎల్‌ఎంకు ప్రమోషన్ త్వరలో రానుంది. జూనియర్ లైన్‌మెన్ పోస్టులు సైతం ఖాళీలు కానున్నాయి. సుమారు 50లైన్‌మెన్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా జూనియర్‌అసిస్టెంట్ పోస్టులు సుమారు 200కిపైగా ఖాళీలు ఉండడంతో డివిజన్ స్థాయిలో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉన్న ఉద్యోగులపై భారం పడుతుంది. దీనికితోడు జిల్లాలో సుమారు 215 సబ్‌స్టేషన్‌లు ఉండగా ఒక్కో సబ్‌స్టేషన్‌లో నలుగురు పనిచే యాల్సి ఉండగా ఇద్దరే పనిచేస్తున్నారు. ఇందులో ఆర్మూర్ డివిజన్‌లో సుమారు 80కిపైగా, నిజామాబాద్ డివిజన్‌లో 70కిపైగా, బోధన్‌లో 35కుపైగా సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి.

ఆపరేటర్ల కొరత

జిల్లా మొత్తంగా కేవలం 497మంది ఆపరేటర్లు ఉన్నారు. మొత్తంగా 645కు పైగా ఆపరేర్ల అవసరం ఉంది. ట్రాన్స్‌కోలో సైతం సబ్‌స్టేషన్‌ల ఆపరేటర్ల కొరత వేధిస్తోంది. 30 సబ్‌స్టేషన్‌లకు గాను సుమారు 240మంది మాత్రమే ఆపరేటర్లు ఉన్నారు. ఇంకా 90మంది ఆపరేటర్ల కొరత ఉంది. విద్యుత్ శాఖలో ఖాళీలు వేదిస్తుండడంతో పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. ఉన్న ఉద్యోగులపై భారం పడుతుండడంతో ఉద్యోగులు సైతం తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో నూతనంగా సీఎండీ రావడం ప్రభుత్వం కూడా మారడంతో రానున్న రోజులోనైనా ఉద్యోగాల భర్తీ చేస్తారని నిరుద్యోగులు ఆశపడుతున్నారు.




ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ. 4.60 కోట్లు



సుభాష్‌నగర్, జనవరి 16: ఆర్టీసీకి సంక్రాంతి పండగ కలిసి వచ్చింది. సంక్రాంతి పండగ కోసం నిజామాబాద్ రీజియన్ అధికారులు ఈనెల11 నుంచి ప్రత్యేక బస్సులను నడిపింది. రోజు వారి బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను నడపడంతో ఆర్టీసీని ప్రయాణికులు ఆదరించారు. సంక్రాంతి పండగ కోసం నిజామాబాద్ రీజియన్‌లోని ఆరు డిపోల్లో సుమారు 650బస్సులతో పాటు 192 అదనపు బస్సులను ఆర్టీసీ అధికారులు వివిధ ప్రాంతాలకు నడిపారు. 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సుమారు 4కోట్ల 60లక్షల ఆదాయాన్ని సమకూర్చింది. ఇందులో నేరుగా టికెట్ల ద్వారా 2.87కోట్లు ఆదాయం సమకూర్చుకోగా, మహాలక్ష్మి జీరో టికెట్ ద్వారా మిగతా ఆదాయాన్ని సమకూర్చుకుని మొత్తం 4కోట్ల 60లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. ఇందులో ముఖ్యంగా జేబీయస్ బస్సులను ఎక్కువగా నడపడంతో వివిధ ప్రాంతాల నుంచి నిజామాబాద్ ప్రాంతానికి సురక్షితంగా ఇళ్లకు చేరవేశారు. హైదరాబాద్ డిపోకు చెందిన 80 బస్సులు జేబీయస్ నుంచి నిజామాబాద్‌కు అదనంగా నడిపారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా అదనపు బస్సులను నడిపారు.







భవిత కేంద్రాలు సమస్యలకు నిలయాలు!





- రెండేళ్లుగా అందని ఆర్థిక సహాయం
- భవిత కేంద్రాలపై ప్రభుత్వం చిన్నచూపు

నిజామాబాద్ అర్బన్, జనవరి 16: మానసిక, శారీరక అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్య పరంగా సహకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2011-12లో సర్వశిక్ష అభియాన్ పథకంలో భాగంగా భవిత విలీన విద్యావనరుల కేంద్రాలను ఏర్పాటు చేసింది. శారీరక, మానసిక 21 రకాల అంగవైకల్యం కలిగిన అత్యవసరాల పిల్లలకు చదువుతో పాటు చికిత్స అందించేందుకు ఐఈ ఆర్‌పీలు, స్పీచ్, ఫిజియోథెరపిస్ట్‌లను నియమించింది. ఈ కేంద్రాల్లో చేరిన విద్యార్థులతో పాటు వారు సహాయకులకు భత్యాలను అందిస్తారు. కానీ గత రెండేళ్లుగా విద్యార్థులకు, సహాయకులకు భత్యాలు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భవిత కేంద్రాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. దివ్యాంగులకు అందాల్సిన రవాణా, ఎస్కార్ట్ భత్యాలు, ఉపకార వేతనాలు కేంద్రం నిర్వహణ నిధులు సకాలంలో అందడం లేదు. 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించిన అన్ని రకాల భత్యాలు, ఉపకార వేతనాలు అందకపోగా ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంకా ప్రతిపాదనలు సిద్ధం కాలేదు.

జిల్లాలో 29 భవిత కేంద్రాలు

జిల్లాలో 29 భవిత విలీన విద్యావనరుల కేంద్రాలు ఉండగా 50 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 8 ఖాళీలు ఉండగా 990 మంది విద్యార్థులు భవిత కేంద్రాల్లో చదువుతున్నారు. వీరిలో 350 మంది దివ్యాంగ విద్యార్థులు ఉండగా వీరికి ప్రతినెలా 500 చొప్పున రవాణా భత్యం చెల్లించాల్సి ఉండగా రెండేళ్లుగా రవాణా భత్యం రావడం లేదు. జిల్లాలో లక్షా 79వేల రవాణా భత్యం పెండింగ్‌లో ఉంది. అంధ విద్యార్థులు 170 మంది ఉండగా ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.5500 ప్రతినెలా చెల్లిస్తారు. వారికి రావాల్సిన 9లక్షల 35వేల ఎస్కార్ట్ అలవెన్స్ ఇంకా రావాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వికలాంగ ఆడపిల్లలు 230 మందికి స్కాలర్‌షిప్ కింద ప్రతినెలా రూ.2వేలు చెల్లిస్తారు. జిల్లాలో 4లక్షల 60వేల స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉంది. 60 మంది అంధ విద్యార్థులకు రీడర్ అలవెన్స్ కింద ప్రతినెలా రూ.600లు చెల్లిస్తారు. జిల్లాలో 36వేల రీడర్ అలవెన్స్ గత విద్యాసంవత్సరానికి రావాల్సి ఉండగా ఇంకా ఈ విద్యాసంవత్సరం ప్రతిపాదనలు ప్రభుత్వానికి అధికారులు సమర్పించలేదు. జిల్లాలో మొత్తం భవిత కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు రావాల్సిన బకాయిలు 16లక్షల 10వేలు.

సమస్యల నిలయాలుగా భవిత సెంటర్లు

మానసిక, శారీరక వైకల్యం కలిగిన విద్యార్థులకు చదువుతో పాటు చికిత్స అందించేందుకు ఏర్పాటు చేసిన భవిత సెంటర్లు సమస్యల నిలయాలుగా మారాయి. భవిత కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం రూ.12వేలు ప్రభుత్వం అందించాల్సి ఉండగా ఆ డబ్బులు కూడా సక్రమంగా అందకపోవడంతో కేంద్రాల నిర్వహణ కష్టంగా మారింది. భవిత కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దివ్యాంగ, మానసిక, అంధ విద్యార్థులకు గత రెండేళ్లుగా అలవెన్స్‌లు రాకపోవడంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను భవిత కేంద్రాలకు పంపేందుకు విముఖత చూపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించాలని కోరుతున్నారు.



ప్రభుత్వానికి నివేదిక పంపాం : శ్రీనివాస్‌రావు (సీఎంవో)

గత విద్యాసంవత్సరానికి సంబంధించి భవిత కేంద్రాలకు రావాల్సిన అలవెన్స్‌ల నిధులు ఇంకా రావాల్సి ఉంది. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతున్నాం. త్వరగా నిధులు విడుదల చేయాలని ఉన్నతాధికారులకు కోరడం జరిగింది. నిధులు విడుదల కాగానే విద్యార్థుల ఖాతాలోనే నేరుగా డబ్బులు జమ అవుతాయి.



నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు

పిట్లం జనవరి16: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను మద్నూర్ ఆర్టీవో సుభాష్ ప్రారంభించారు. మంగళవారం ధర్మారం టోల్ ప్లాజా వద్ద 35వ జాతీయరహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ ఇంజనీరింగ్, మరియు విద్యాపరమైన చర్యల సాయంతో రహదారి భద్రతను మెరుగుపరచడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రతిజ్ఞను నిర్వహించి మరణాలను తగ్గించడంలో అత్యవసర సేవల పాత్ర గురించి ఆర్‌ఐ వివచించారు. కార్యక్రమంలో పెద్దకొడప్గల్ ఎస్సై కోనా రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ అంబర్‌సింగ్, రెహమాన్ ఆర్‌ఈ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడి ఎన్నిక

బీర్కూర్, జనవరి16: వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా అంబిలి బస్వారాజ్ పటేల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పటోల్ల సంగమేశ్వర్ నియామక పత్రాన్ని బస్వరాజ్ పటేల్‌కు అందజేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడిగా తనను నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లింగాయత్‌ల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని, సంఘ బలోపేతం కోసం పాటుపడతానని ఆయన స్పష్టంచేశారు.

18న మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో వడ్ల వేలం

నాగిరెడ్డిపేట, జనవరి16: మండలంలోని మాల్తుమ్మెద ప్రభుత్వ విత్తన క్షేత్రంలో ఈనెల 18న మధ్యాహ్నం 12 గంటలకు విత్తనం కోసం ఉపయోగపడని 120 క్వింటాళ్ల దొడ్డు రకం వడ్లను విత్తన క్షేత్రంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు విత్తనక్షేత్రం ఏడీఏ వీరస్వామి తెలిపారు. విత్తనం కోసం ఉపయోగపడని దొడ్డు రకం వడ్లు జేజీఎల్ 24423 రకం 90 క్వింటాళ్లు, కేఎన్ఎం 118 రకం 30 క్వింటాళ్లు వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు రెండు వేల రూపాయలు దరఖాస్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేస్తాం

దోమకొండ, జనవరి 16: కాంగ్రెస్ పభుత్వం చేపట్టిన పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీమంత్రి షబ్బీర్‌అలీ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చేరేలా గ్రామ స్థాయిలో పని చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి ముత్యంపేట పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేసేది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అన్నారు. కాంగ్రెస్ హయంలోనే పెదలకు పథకాలు అందయన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో అబ్దిదారులకు అందే విధంగా గ్రామ స్థాయిలో పని చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంలు రాజు, చంద్రం నరేష్, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: మాజీ ఎమ్మెల్యే

బాన్సువాడటౌన్, జనవరి16: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగించడంతోపాటు శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో కొనసాగుతున్న ఈఆర్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్ తిలకించారు. మ్యాచ్ గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఉండాలన్నారు. అంతేకాకుండా గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల నైపుణ్యతను వెలికితీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, నార్ల సురేష్, మాసాని శేఖర్‌రెడ్డి, యలమంచలి శ్రీనివాస్‌రావు, అన్వర్, అఫ్రోజ్,ఆయా గ్రామాల క్రీడాకారులు తదితరులున్నారు.



ఫైనల్ మ్యాచ్‌లో టాస్ వేస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

నేడు రాంపూర్‌లో రక్తదాన శిబిరం

డిచ్‌పల్లి, జనవరి 16: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నేడు యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో యువతరం రక్తదాన శిబిరం నిర్వహిస్తోందని యూత్ అధ్యక్షుడు విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. యువత రక్తదానం చేయడానికి ముందకు రావాలని ఆయన కోరారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రెంజల్,జనవరి16: మండలంలోని మౌలాలి తండా గ్రామంలో మంగళవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సర్పంచ్ సునీత బాబు నాయక్ ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం సంక్రాంతి సెలవు దినాల్లో మౌలాలి తండా యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా కబడ్డీ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ లోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఈ పోటీలలో పాల్గొనడం జరిగిందన్నారు. సంక్రాంతి సెలవులలో ఇలాంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు అశోక్, శ్రీకాంత్, పవన్, మురళీ, చందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణం

నవీపేట,జనవరి16: మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ మందిరంలో సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం, పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు మహిళలు ఒకరికొకరు నోములు అందించుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో రాజశ్రీ, గౌతమి, పల్లవి, స్వప్న, దీపిక, నీలిమా, తదితరులున్నారు.



నవీపేటలో శివ పార్వతుల కల్యాణ దృశ్యం

కమ్మర్‌పల్లి వీడీసీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



కమ్మర్‌పల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వీడీసీ సభ్యులు

కమ్మర్‌పల్లి, జనవరి 16: మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అలంకరించి, నిర్వహించిన ముగ్గులపోటీల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. గాయిని కవిత్రి మగ్గిడి లక్ష్మీ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ముగ్గులపోటీల్లో విజేతకు వీడీసీ అధ్యక్షుడు అంగిరేకుల మల్లయ్య యాదవ్, కోశాధికారి సిలివేరి భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి అంకోజి అంకిత్, నవాతే రంజీత్ వీడీసీ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాంపూర్, ఫత్తేనగర్‌లలో గ్రామసభలు



ఫత్తేనగర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ

నవీపేట,జనవరి16: మండలంలోని రాంపూర్, ఫత్తేనగర్‌లలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. డ్రోన్ ద్వారా పంట పొలాలకు రసాయన ఎరువులు పిచికారి చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, రాంపూర్ సర్పంచ్ రుతు కల్పన, ఫత్తేనగర్ సర్పంచ్ ఆసిఫా ఖతున్, ఎంపీటీసీ లావణ్య, ఆర్‌ఐ మోహన్, మెడికల్ ఆఫీసర్ స్వామ్రాట్ యాదవ్, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, జనార్ధన్ తదితరులున్నారు.

బోధన్‌లో ఏటీఎం ధ్వంసం

బోధన్ రూరల్, జనవరి 16: బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల ఎంకే చౌదరి పెట్రోల్ బంక్ ప్రాంగణంలో ఏటీఎం మిషన్‌ను సిద్దాపూర్ గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి ధ్వంసం చేసినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. డబ్బులు డ్రా చేయడానికి ఏటీఎం కేంద్రానికి వెళ్లగా మద్యం తాగి ఉండటంతో ఏటీఎం మిషన్ అద్దాలను ధ్వంసం చేశాడని, ఈ సందర్భంగా ఆయన చేతికి గాయాలయ్యాయన్నారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి వెళ్లి బాధితున్ని చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. పెట్రోల్ బంక్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.



ధ్వంసమైన ఏటీఎం మిషన్

గడ్డి మందు తాగి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, జనవరి16: మండలంలోని తొర్లికొండ గ్రామానికి చెందిన గొల్ల శోభన్ (32) గడ్డి మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. గొల్ల శోభన్ బతుకు దెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడని, ఇంటి వద్ద ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. ఈనెల 13న అతని ఇంటి వద్ద గడ్డి మందు తాగారని, దీన్ని గమనించిన కుటుంబసభ్యులు అతనిని చికిత్స నిమిత్తం ముప్కాల్ లోని మమత నర్సింగ్‌హోమ్ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. చికిత్స పొందుతూ ఈనెల 14న గొల్ల శోభన్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు.

జిల్లా అంతటా సంక్రాంతి సంబరాలు



నృత్యం చేస్తున్న దిల్‌రాజ్, గ్రామస్థులు



డొంకేశ్వర్‌లో గాలిపటాలు ఎగురేస్తున్న చిన్నారులు



చందూర్‌లో ఎడ్లుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



వర్నిలో మటన్ కోసం బారులు తీరిన ప్రజలు



కమ్మర్‌పల్లిలో ఇంటిముందు రంగురంగుల ముత్యాల ముగ్గు



ఇందల్వాయిలో..

మోపాల్, జనవరి 16: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో ఉన్న ఇందూరు తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం భోగి మంటలను ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాల్లో సినీ నిర్మాత దిల్‌రాజ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆటపాటలతో నృత్యాలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, ఎంపీటీసీ రాములు, రవీందర్‌యాదవ్, నరాల సుధాకర్, ప్రసాద్, రాజేశ్వర్, గంగారెడ్డి, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దిల్‌రాజ్ స్వగ్రామమైన నర్సింగ్‌పల్లి కావడంతో ప్రతీసంవత్సరం సంక్రాంతి వేడుకల్లో పాల్గొంటున్నారు. అలాగే ఇందూరుతిరుమల ఉత్సవాల్లో కూడా పాల్గొనడం విశేషం.ఈవేడుకల్లో కుటుంబ సభ్యులందరూ ఉత్సవాలు పూర్తయ్యేంతవరకు భక్తిశ్రద్ధలతో గడుపుతారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో సోమ, మంగళవారం సంక్రాంతి సంబరాలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ రోజున రకరకాల పిండి వంటలు, వాకిట్లో ముగ్గులు వేసి గొబ్బెలు ఏర్పాటు చేసి వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. కనుమ రోజు విందు వినోదాలతో ప్రజలు సరదాగా గడిపారు.

వర్ని: వర్ని, రుద్రూరు, చందూరు మండలాల పరిధిలో సంక్రాంతి పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం భోగీ, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ వేడుకలను ప్రజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. కనుమ వేడుకల్లో భాగంగా చందూర్ మండల కేంద్రంలో ఎద్దుల పరుగు పోటీలు నిర్వహించి కనువిందు చేశారు. సర్పంచ్ సాయిరెడ్డి, విండో చైర్మన్ ప్యారం అశోక్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఏర్పాటు చేశారు. కనుమ సందర్భంగా మటన్, చికెన్ కొనుగోళ్లకు ప్రజలు బారులు తీరారు. దీంతో కిలో నాటు కోడి ధర రూ.500 పలికింది. ఆయా గ్రామాల్లో రంగురంగుల ముగ్గులు వేసి యువతులు, మహిళలు పండుగ ప్రత్యేకతను చాటారు. గాలి పటాలు ఎగురవేస్తూ యువకులు పోటీ పడ్డారు.

నవీపేట: మకర సంక్రాంతి వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులను వేసి గొబ్బెమ్మలను పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం పాలను పొంగించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం చిన్న పిల్లలకు తలపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

● **అయ్యప్ప ఆలయంలో పూజలు**

మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం మకర జ్యోతి దర్శనం అనంతరం అయ్యప్ప స్వామిని భక్తులు, మాలధారులు దర్శించుకున్నారు.

బోధన్ రూరల్: బోధన్ పట్టణంతో పాటు సాలూర మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినోకరు నువ్వులు, చక్కెర అందిస్తూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వ్యవసాయదారులు తమ ఆచారల ప్రకారం పంట పొలాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు చల్లగా ఉండాలని, ప్రజలందరూ ఆయురోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలుచేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల ప్రత్యేక పూజలు చేశారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో పెద్దలు, యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి ఆనందోత్సహాల మధయ సంక్రాంతి పండగను జరుపుకున్నారు. ఈసందర్భంగా గ్రామాలలో ఇంటి ఎదుట మహిళలు, యువతులు వరి ఇంటి ఎదుట ముగ్గులు వేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

పెర్కిట్: మకర సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని ప్రజలు ఆనందోత్సవాల మధ్య సంబరాలు నిర్వహించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను పట్టణ ప్రజలు, పిండి వంటలు రంగుల ముగ్గులు, పతంగులు ఎగురవేస్తూ చిన్న పెద్ద అందరు ఆనందంగా గడిపారు. హన్మాన్ మందిర కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి అదే విధంగా విజేతలుగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ మహిళలకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ బహుమతులు అందజేశారు. జిరాయత్ నగర్ హన్మాన్ మందిరం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్వారి తులసీ, లక్ష్మీనారాయణ, స్థానిక కౌన్సెలర్ ఖాందేశ్ సంగీత, ఖాందేశ్ శ్రీనివాస్, పుష్పకర్‌రావు, సురేష్, ఆనంద్, సతయం, హన్మాన్ కమిటీ సభ్యులు, విట్టం శేఖర్, నూకల శేఖర్, బాస్కర్, నవీన్, అంబల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ గ్రామాలలో యువతులు, విద్యార్థినులు తమ ఇంటి ముందు అందమైన ముగ్గులను వేశారు. మామిడిపల్లిలో వేంకటేశ్వరకాలనీలో గిర్వాణి అనే యువతి అయోధ్య రామ మందిరం, శ్రీరామ సీతాదేవీల రంగురంగుల ముగ్గుల రూపంలో వేశారు. అయోధ్య ముగ్గు అందరిని ఎంతగానో ఆకట్టుకుంది. అదే విధంగా ఆలూర్ మండల కేంద్రంలో ఓ యువతి తన ఇంటి ముందు ముగ్గు వేసి జైరేవంత్‌రెడ్డి అని జైకాంగ్రెస్ అని పేరు రాసి కాంగ్రెస్ పార్టీపై వారి అభిమానాన్ని చాటుకున్నారు.. మండలంలోని వివిధ గ్రామాలలో సంక్రాంతి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. యువకులు, పెద్దలు గాలిపటాలు ఎగురవేయడంలో ఉత్సహం ప్రదర్శించారు. అదే విధంగా పట్టణంలోని హస్నాబాద్‌గల్లీలో ప్రతీ గడప ముందు వివిధ రకాల ముగ్గులను వేయగా పలువురు అయోధ్యలోని రామాలయంతో పాటు ప్రధాని నరేంద్రమోదీ, రాముని చిత్రపటాలను వేయడంతో ప్రత్యేకఆకర్షణగా నిలిచాయి.దీంతో పలువురు అభినందించారు.

కమ్మర్‌పల్లి: తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మకర సంక్రాంతి పర్వదినాన్ని కమ్మర్‌పల్లి మండల ప్రజలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలు అనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా తెలుగింటిలోగిళ్లి రంగరంగుల ముత్యాల ముగ్గులతో శోభిల్లాయి గ్రామీణ ప్రాంత వాతావరణం ఉట్టిపడేలా తెలుగింటి యువతులు సాంప్రదాయ దుస్తుల్లో వెలిగిపోయారు. గ్రామాల్లో యువకులు, పిల్లలు గాలిపటాలను ఎగురవేస్తూ పరస్పర అనందాలను పంచుకున్నారు. పట్టణాల నుంచి యువకులు, ఉద్యోగులు, విద్యార్థులు తమ స్వగ్రామాలకు చేరుకుని కుటుంబ సభ్యులతో సంక్రాంతి సంబరాలల్లో మునిగితేలారు దూరప్రాంతాలలోని వారందరు గ్రామాలకు చేరుకోవడంతో ప్రతీ పల్లే కొత్తముఖాలతో కలకలలాడింది. మకర సంక్రాంతి సందర్భంగా ప్రతీ తెలుగింట్లో పిండివంటలతో ఘుమఘుమలాడింది, పండగ సందర్భంగా పరస్పరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల ప్రజలకు ప్రజాప్రతినిధులు అధికారులు పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం భోగి, సోమవారం కునుమ పండగలను ఆనందోత్సవాలమధ్య ఘనంగా జరుపుకున్నారు.

ముప్కాల్: బాల్కొండ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో సోమవారం మకర సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు వేసిన పిండి వంటలు గుమగుమలాడాయి. ఉదయం నుంచి సంక్రాంతి పర్వదినం సందర్భంగా దేవాలయాలు కిక్కిరిసి పోయాయి. ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాకిట్లో అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పేర్చారు. కొత్త పంటలతో రైతుల ఇళ్లలో సిరులు నిండాలని వపూజలు చేశారు.

29న డిచ్‌పల్లి ఎంపీపీ,వైస్ ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానం

- ఆర్డీవో సమక్షంలో ఆవిశ్వాసం పై తీర్మానం
- ఆర్డీవోకు అవిశ్వాసం నోటీసు ఇచ్చిన ఎంపీటీసీలు
- కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్న 12మంది ఎంపీటీసీలు
- ఇటీవల కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీలు

డిచ్‌పల్లి,జనవరి 16: డిచ్‌పల్లి మండల పరిషత్ అధ్యక్షుడు (భాజపా) గడ్డ భూమన్న, వైస్ ఎంపీపీ కులచారి శ్యాంరావులపై మండలంలోని 13 మంది ఎంపీటీసీ సభ్యులు ఆవిశ్వాసం పెడుతూ తాజాగా ఆర్డీవో రాజేందర్‌కుమార్‌కు అవిశ్వాస తీర్మాణ పత్రాలు సభ్యుల సంతకాలతో అందజేశారని, సంతకాల పరిశీలనకోసం ఫైల్ తనవద్దకు చేరిందని మండల ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు గురువారం తెలిపారు. అవిశ్వాస తీర్మాణ పత్రం అందజేసిన వారిలో ముల్లంగి గ్రామ ఎంపీటీసీ చిన్నోళ్ల నర్సయ్య (నడిపల్లి-2), మెంట్రాజ్‌పల్లి ఎంపీటీసీ (సుప్రియ), సాంపలి (రాథోడ్ భిక్య), సుద్దులం(గోదావరి), యానంపల్లి (అప్పలమంజుల), ఘన్‌పూర్(కుర్రిసవిత) రాంపూర్(పోతర్లసుజాత), మిట్టపల్లి (బాల గంగాధర్), కమలాపూర్ (దండోళ్ల సుప్రియ), ధర్మారంగ్రామ 1 (నర్సింగరావు),ధర్మారం-2(శకటి రాజమణి), బర్దిపూర్ (కృష్ణవే ణి), గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు ఆర్డీవో రాజేందర్ కుమార్‌కు అవిశ్వాస నోటీస్ పత్రం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుల సంతకాల వెరిఫికేషన్ కోసం ఆర్డీవో కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి ఫైల్ చేరింది. సంతకాల వెరిఫికేషన్ కోసం అధికారులకు అవిశ్వాస నివేదిక అందిస్తామని ఎంపీడీవో గోపిబాబు తెలిపారు. మరో రెండు రోజుల్లో అవిశ్వాసంపై తేదీ ప్రకటన వెలువడే ఆవకాశం కనబడుతుంది. మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం కోసం విశ్వప్రయత్నాలు చేశారు. గత ఎన్నికలో కాంగ్రెస్ నుంచి గెలిచి ప్రస్తుతం నడిపల్లి -2 ఎంపీటీసీగా కొనసాగుతున్న చిన్నోళ్ల నర్సయ్యకు ఎంపీపీ పదవి దక్కే ఆవకాశం కనబడు తుంది. ఇప్పటికే 12మంది ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఎంపీపీ అభ్యర్థికి మద్దతు తెలపనున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న రాంపూర్ ఎంపీటీసీ పోతర్ల సుజాత, మిట్టపల్లి ఎంపీటీసీ బాలగంగాధర్, కమలాపూర్ ఎంపీటీసీ సుప్రియ, అమృతాపూర్ ఎంపీటీసీ సాయిలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి బయటినుంచి మద్దతు ఇస్తున్నట్లు సమాచారం.



డిచ్‌పల్లి ఎంపీపీ ఛాంబర్

● **29న అవిశ్వాసానికి ఏర్పాట్లు**

ఎంపీటీసీ సభ్యుల అవిశ్వాస తీర్మాణం మేరకు ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై అవిశ్వాస తీర్మాణం ఈ నెల 29న ఆర్డీవో రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో అవిశ్వాసం పై చర్చ జరగనుందని ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు మంగళవారం సాయంత్రం తెలిపారు. 10:30 గంటలకు ఎంపీపీపై, 11గంటలకు వైస్ ఎంపీపీలపై అవిశ్వాసం నిర్వహిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

అయోధ్య రామమందిరంపై బీజేపీ రాజకీయం చేస్తోంది

● **రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్**



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్

మోర్తాడ్, జనవరి16: అయోధ్యలోని రామమందిరం ప్రతిష్ఠాపన పట్ల బీజేపీ రాజకీయంగా వాడుకుంటోందని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం మోర్తాడ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామ మందిర ప్రతిష్ఠాపన పట్ల వ్యతిరేకం కాదని, హిందువులుగా రామ మందిర ప్రతి ష్ఠాపన కోరుకుంటుందన్నారు. బీజేపీ రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల ముందు ప్రతిష్ఠాపన చేయడాన్ని తప్పుపడు తున్నామని అన్నారు. అంతేగాక ఆలయ నిర్మాణం పూర్తి కాక ముందే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతిష్ఠాపన చేయడం సమంజసంగా లేదని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొనడంలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల బీజేపీ విషం చిమ్ముతోందని అన్నారు. బీజేపీ వారే హిందువులు కాదని, కాంగ్రెస్ వాళ్లు కూడా హిందువులు అని మాకు రాముడు అంటే భక్తి ఉందని వేణుగోపాల్ అన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల సునీల్ కుమార్, అడ్వకేట్ ప్రవీన్, మహిపాల్, గిర్మాజీ గోపి, జైడి గంగారాం, బక్కూరి అశోక్, నవీన్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నీరజ్, పలు గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి,జనవరి16: దేశ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో మారుతి సూచించారు. పొతంగల్ మండలంలోని చేతన్ నగర్, హెగ్డోలి గ్రామాలలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నవ భారత నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. బీమా, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పోషణ్ అభియాన్ సేవలు పొందాని, చిన్న పిల్లల్లో పోషకాహార లోపం అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి జగదీష్, విఠల్, హెల్త్ సూపర్‌వైజర్ సాయి కుమారి, విజయ, సుభాషిణి, మమత తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఘనంగా కనుమ పండుగ



ధర్మారం(బి) వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

డిచ్‌పల్లి,జనవరి 16: సంక్రాంతి పండగ కనుమ వేడుకలను సోమవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఇంటి ముందట వివిధ రకాల రంగుల ముగ్గులు వేశారు. ధర్మారం(బి) వేంకటేశ్వర స్వామి ఆలయంలో కనుమ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బాల్కొండలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ముప్కాల్, జనవరి16: బాల్కొండ మండల కేంద్రంలోని నవీన్ పబ్లిక్ స్కూల్‌లో 2009-10పదవ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు మంగళ వారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15ఏళ్ల క్రితం నాటి చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా 15ఏళ్ల క్రితం విద్యార్థి దశలో పాఠశాలలో జరిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలోని తరగతి గదులు తిరుగుతూ ఉపాధ్యాయులతో కలియతిరిగి విషయాలను నెమరువేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులందరు కలిసి పూలమాలు, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నవీన్, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు, పాల్గొన్నారు.



బాల్కొండలో 2009-10 పదవ తరగతి పూర్వవిద్యార్థులు

ధర్పల్లిలో పంచ కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ధర్పల్లి,జనవరి 16: మండల కేంద్రంలో గల టీటీడీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పంచకల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈసందర్భంగా శివపార్వతులకు,సూర్యదేవుడు,వీరభద్రస్వామి, గౌరీదేవి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్స వ మూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రతియేటా పంచకల్యాణోత్సవం నిర్వహిస్తే అందరికి శుభం కలుగుతోందని అందుకే ప్రతియేటా కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు మహేష్, సిద్దేశ్వర్, గంగదాసు, ప్రసాద్, రాజశేఖర్, రాములు, రాజగంగయ్య, ప్రవీణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు శారీరక దారుఢ్యానికి ఎంతో అవసరం



విజేతగా నిలిచిన జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, జనవరి 16: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి ఎంతో ఉపయోగపడుతాయని సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్ అన్నారు. వారం రోజుల పాటు కొనసాగిన క్రికెట్ పోటీలో విజేత నిలిచిన ఛత్రపతి శివాజీ సాలూర జట్టుకు రూ. 22,222 నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రతియేటా క్రికెట్ టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. యువత క్రీడలపై మక్కువ పెంచుకుని అభివృద్ధి బాటలో నడవాలని పేర్కొన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధారుడ్యానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి, సర్పంచ్ భూయ్యాన్ చంద్రకళ, భూయ్యాన్ సురేష్, ఉప సర్పంచ్ డిస్కో సాయిలు, అల్లె రమేష్, సొసైటీ కార్యదర్శి బస్వంత్‌రావు పటేల్, అల్లె రవి, బుద్దె లక్ష్మణ్, గంగారం, విఠల్, సర్పంచ్‌లు నాగయ్య, మాజీ సర్పంచ్ గంగాధర్, శివాజీలతో పాటు గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సాయి నామస్మరణతో సకల శుభాలు

బోధన్ రూరల్, జనవరి 16: సాయి నామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని సాయిబాబా ఆలయ వేద పండితులు అన్నారు. పట్టణంలోని గంజ్ రోడ్డులో గల సాయిబాబా దేవాలయంలో 24వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి పర్వదినం, సాయిబాబా ఆలయ వార్షికోత్సవం కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం సాయి నామ కీర్తనతో మారుమోగింది.అనంతరం పల్లకి ఊరేగింపుతో పాటు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అశోక్‌రావు కులకర్ణి, పబ్బ మురళీ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

బీఆర్‌ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



కోటగిరిలో బీఆర్‌ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పోచారం

కోటగిరి,జనవరి16: కోటగిరి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొల్లూర్ కిషోర్‌ను మంగళవారం మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్‌లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశానికి వెళ్లి తిరిగి వస్తుండగా బీఆర్‌ఎస్ నాయకులు ప్రయాణిస్తున్న కారు సదాశివనగర్ మండలం దగ్గి వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కొల్లూర్ కిషోర్, ఏఎంసీ చైర్మన్ హమీద్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గంగాధర్‌లు గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బాధిత నాయకులను పరామర్శించారు. రోడ్డు ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ కార్యకర్తకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

22న ప్రతీ ఇంట్లో దీపావళిలా వేడుకలు చేయాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జనవరి 16: ఈనెల 22న అయోధ్య రామమందిరం పునఃప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంట్లో దీపావళి వేడుకలలా దీపారాధన చేయాలని, సంబరాలు చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే, శ్రీరామ తీర్థశ్రేష్ట ట్రస్ట్ కోకన్వీనర్ ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 500 ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న హిందూ ప్రజల కోరిక నెరవేరనున్న ఈ శుభసమయంలో 22న ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి పండుగ వాతావరణం ప్రతిబింబించేలా వేడుకలు జరుపుకోవాలన్నారు. ఈనెల 18న ఖిల్లా రామాలయంలో శుద్ధి కార్యక్రమం, 20వ తేదీన నగరంలోని అన్ని పురాతన ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 22వ తేదీ ఉదయం 6గంటలకు ఖిల్లా రామాలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని రాముల వారికి అభిషేకం, హోమం, సీతారాముల కల్యాణం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అయోధ్య రామమందిరం నుంచి ప్రత్యేక ప్రసారాలు, విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలను వీక్షించడం జరుగుతుందన్నారు. 22ననగరంలోని శంభుని గుడి చుట్టూ 1500 మంది మహిళా సోదరీమణులతో దీపారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని కావున మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నగరంలోని అన్ని పార్టీల నాయకులను, కుల సంఘాల ప్రతినిధులను, ప్రజలను స్వాగతిస్తున్నామని అందరం కలిసి కట్టుగా ఇందూరు నగరాన్ని కాషాయమయం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, న్యాలంరాజు,మాస్టర్‌శంకర్,శివప్రసాద్,నారాయణ యాదవ్,రోషన్‌లాల్‌బోరా పాల్గొన్నారు.

సిద్ధులగుట్టపై పూజలు చేసిన జిల్లా న్యాయాధికారి

ఆర్మూర్‌రూరల్, జనవరి16: ఆర్మూర్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం నవనాథ సిద్ధులగుట్టపై జిల్లా న్యాయాధికారిని సునీత కుంచాల సోమవారం పూజలు నిర్వహించారు. జిల్లా న్యాయాధికారి సునీత కుంచాలతో పాటు ఆర్మూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారి వేముల దీప్తి, జిల్లా అదనపు డీసీపీ జయరాం ఆలయాన్ని సందర్శించారు. సిద్ధులగుట్టపై వెలిసిన స్వయంభు లింగం ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సిద్ధులగుట్టపై ఉన్న రామాలయం, ఇతర ఆలయాలను సందర్శించారు. స్వయంభు శివలింగానికి పంచామృతలతో అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల మాట్లాడుతూ ప్రసిద్ద సిద్ధులగుట్ట దర్శనానికి కుటుంబసభ్యులతో వచ్చామని, సిద్ధులగుట్ట అద్భుతంగా ఉందని, మంచి అభివృద్ధి జరుగుతోందని అన్నారు. అనంతరం జిల్లా న్యాయాధికారి, న్యాయమూర్తులు, పోలీస్ అధికారులను, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లీగల్ చైర్ అథారిటీ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్, ఆర్మూర్ సీఐ సురేష్‌బాబు, సీనియర్ న్యాయవాదులు ఖాందేశ్ శ్రీనివాస్, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సిద్ధులగుట్టలో పూజలు చేస్తున్న జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

● అంకాపూర్ గ్రామస్థులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంకాపూర్ గ్రామస్థులు

ఆర్మూర్‌రూరల్, జనవరి16: ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని అంకాపూర్ గ్రామస్థులు హెచ్చరిం చారు. ఇటీవల ఓ టీవీ ఇంటర్వ్యూలో మాజీఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అంకాపూర్ గ్రామాన్ని కించపరుస్తూ మాట్లాడడమే గాకుండా ప్రస్తుత ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి కుటుంబంపై వ్యక్తిగత దుష ణాలు దిగడం పట్ల మండిపడ్డారు. సోమవారం విలేకరుల సమావేశంలో గ్రామస్థులు మాట్లాడుతూ ఓడిపోయామనే అక్కసుతోనే మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చౌకబారు విమర్శలకు పాల్పడుతున్నారన్నారు. అభివృద్ధి, రాజకీయాలపై మాట్లాడాలే తప్ప వ్యక్తిగత దుషణాలకు దిగడం, అంకాపూర్ గ్రామ ప్రతిష్ఠను అగౌరపరిచే విధంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. తమ గ్రామానికి చెందిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిపై అభిమానం ఉండి ఇటీవల జరిగిన ఎన్నికల్లో గ్రామంలో 2700ఓట్లు వేశారన్నారు. ఇక ముందు ఇలాంటి అసత్యపు ఆరోపణలు చేస్తే మాజీఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని గ్రామస్థులు హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, మాజీసర్పంచ్‌లు జి.రాజన్న, పెర్కిట్ రవి, మాజీ ఎంపీటీసీ శంకర్, నారాయణరెడ్డి, గంగారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగేలా విగ్రహాలను ప్రతిష్ఠించరాదు : సీపీ

ఖిల్లా, జనవరి 16: ప్రజలకు ఇబ్బంది కలిగేలా వివిధ రకాల విగ్రహాలను ప్రతిష్ఠించరాదని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనేవార్ తెలిపారు.మంగళవారం సంబంధిత మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులకు సూచించారు. ము ఖ్యంగాజన సంద్రంతో రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయరాదని తెలిపారు. రాష్ట్ర పోలీస్ శాఖ ఆదేశాల మేరకు ప్రజలు ఈ ఉత్తర్వులను పాటించాలని తెలిపారు. అదేవిధంగా ఎక్కువ శబ్ధంతో డీజేలను ఏర్పాటు చేయరాదన్నారు. ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. డ్రోన్‌ల వాడకం, మాల్స్, సినిమా థి యేటర్స్, హోటల్స్ చోట్ల ప్రజల కోసం సెక్యూరిటీ నిబంధనలు పా టించాలని తెలిపారు. పోలీస్ శాఖ వారి ఆదేశాలు పాటించని పక్షం లో వారిపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీపీ హెచ్చరించారు.

రోడ్లపై నూతన విగ్రహాలకు అనుమతి లేదు

ముప్కాల్: మండలంలో నూతన విగ్రహాలకు అనుమతులు లేవని స్థానిక ఎస్సై భాస్కరచారి. మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్ అండ్‌బీ రోడ్లపై కొత్త విగ్రహాల ఏర్పాటు చేయడానికై అనుమతి లేద న్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్‌సూపరింటెండెంట్, ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. అదే విధంగా పంక్షన్‌హాల్‌లో, వీదులలో డీజేలకు, డ్రోన్ కెమెరాలకు అనుమతి లేదన్నారు. డీజే సౌండ్ రెసిడెన్షియల్ స్థలంలో, రాత్రి సమయంలో 45బీడీ సౌండ్ వాడాలని, పోలీసులు అనుమతి తప్పనిసరి తీసుకోవాలని ఆయన సూచించారు.

● నూతన విగ్రహావిష్కరణలకు అనుమతి లేదు

మోర్తాడ్: మండలంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠాపనకు అనుమతులు లేవని స్థానిక ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆర్‌అండ్‌బీ రోడ్లపై కొత్త విగ్రహాల ఏర్పాటు చేయడానికై అనుమతి లేదన్నారు. రోడ్లపై విగ్రహాలు, స్మారక చిహ్నాలు అనివార్యమైతే ఎక్కువ ట్రాఫిక్ ఉన్న ప్రదేశాలలో, ప్రభుత్వ భవనాల ప్రాంగణాలు, టౌన్‌హాల్, ప్రజా ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలలో మాత్రమే ఉండాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ , ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ అధికారుల అనుమతి తప్పనిసరి అని అనిల్‌రెడ్డి అన్నారు. ఈ సూచనలు 16 నుంచి అమలులో ఉందని, ఈ విషయం స్థానిక అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించిన తీవ్రంగా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారని ఎస్సై అనిల్‌రెడ్డి వివరించారు.

16 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

● పేకాట ఆడితే కఠిన చర్యలు



పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న దృశ్యం

బోధన్‌రూరల్, జనవరి 16: పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్‌ఐ నాగ్‌నాథ్ తెలిపారు. పేకాట ఆడుతున్న పదిమందిని తాము పట్టుకుని కేసునమోదు చేసినట్లు, మరోఆరుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. సంగం, ఊట్‌పల్లి, సాలూర క్యాంప్, పెద్దమావంది తదితర గ్రామాల్లోని రహస్య ప్రాంతాలలో పేకాట ఆడుతున్నార పక్కా సమాచారం మేరకు దాడులు చేపట్టి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.38 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట ఆడిన, నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు జూదానికి కావద్దని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

జాగృతి సంచిక ఆవిష్కరణ

నవీపేట,జనవరి16: కేశవ ప్రభాత్ శాఖ నవీపేట ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని మహలక్ష్మి మందిరం ఆవరణలో జాగృతి వారపత్రిక సంచికను ఆవిష్కరించారు. అయోధ్యలోని రాంలల్లా ప్రాణప్రతిష్ఠకు సంబంధించి ఈ సంచికలో ముద్రించారు. ఈ సంచికను నిర్వాహకులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో దయానంద్, రమేష్, సతీష్ తదితరులున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడి మృతి

నవీపేట,జనవరి16: మండలంలోని మహంతంకు చెందిన మేకల పోశెట్టి(70)అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు చెరువులో పడిమృతి చెందాడని ఎస్‌ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. ఈ నెల 14న బయటకు వెళ్లిన అతను తిరిగి ఇంటికి చేరుకోలేదని మంగళవారం అతని మృతదేహం గ్రామ శివారులోని చెరువులో లభ్యమైందని ఎస్‌ఐ తెలిపారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో కాలుజారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా కుమారుడు మేకల సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాటాపూర్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్ దృశ్యం

రెంజల్,జనవరి16: మండలంలోని సాటాపూర్ గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి సాటాపూర్ గ్రామ శివారులో ఒక ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఉదయ్ కుమార్ హెచ్చరించారు.

నేడు ఆంధ్రనగర్‌కు మంత్రి తుమ్మల రాక

నందిపేట, జనవరి16: నందిపేట మండలంలోని ఆంధ్రనగర్ గ్రామానికి బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు, స్థానిక సర్పంచ్ నాయుడు రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు గింజుపల్లిరాధ తెలిపారు. ఎన్‌టీఆర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహన్ని ఆవిష్కరిస్తారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు మాజీ మంత్రి మండవ వేంకటేశ్వర్ రావు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి హజరైతారని, ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఎన్‌టీఆర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు కోరారు.

క్రీడలు పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

● జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారుడు కబడ్డీ గంగాధర్



అండర్ -14, 17కు ఎంపికైన ఖోఖో జట్టు

మెండోర, జనవరి14: క్రీడాకారులకు క్రీడలు ఎంతో దోహదపడుతాయని పట్టుదల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తప్పనిసరిగా విద్యార్థులు ఏదో ఒక క్రీడల్లో నిరంతరం సాధన చేయాలని- జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారుడు కబడ్డీ గంగాధర్ అన్నారు. మండలంలో పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాలలో రాష్ట్ర రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ పోచంపాడ్‌లో ప్రిన్సిపాల్ తారాసింగ్, పిడి సంజీవ్ పర్యవేక్షణలో అండర్ 14, అండర-17 విభాగాలలో జరిగిన ఖోఖో శిక్షణ శిబిరం ముగిసింది. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు తెలంగాణ ఆల్‌సొసైటీ అండర్-14, అండర్-17 బాలబాలికల టోర్నమెంట్ ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు ఉట్నూర్‌లో నిర్వహించబడే టోర్నమెంట్‌కు పాల్గొంటారని తెలిపారు.ఖోఖో శిక్షణ ముగింపు కార్యక్రమానికి రిటైర్డు అంజయ్య, పీడీ రాజ్‌కుమార్, క్రీడాభిమాని కనకయ్య, నోముల శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారులు నైపుణ్యాతను పెంపొందించుకోని సొసైటీకి గోల్డ్‌మెడల్ సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల దరఖాస్తుకు 20వరకు గడువు పొడిగింపు

డిచ్‌పల్లి, జనవరి 16: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ దరఖాస్తు తేదీ జనవరి 15తో ముగియగా విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు తేదీని జనవరి 20వరకు పొడిగించినట్లు సొసైటీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సంగీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ పరీక్ష ఫిబ్రవరి 4న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు జరుగుతోందని దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నమని ప్రిన్సిపల్ తెలిపారు.5వ తరగతి ప్రవేశపరీక్ష అదే విధంగా తెలంగాణలోని వివిధ గురుకుల పాఠశాలు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఎమ్ జేపీబీ డబ్ల్యూఆర్ ఈఐఎస్, టీఆర్‌ఈఐఎస్ పాఠశాలలో 2024 సంవత్సరానికి గాను 5వ తరగతికి ప్రవేశం పొందే విద్యార్థులు జనవరి 20తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11ఉదయం 11గంటలకు నిర్వహించడం జరుగుతోందని విద్యార్థులు ఈఆవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



అంబేద్కర్‌విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ జనవరి 16: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. సిరికొండ మండలం చిన్నావాల్గోట్ గ్రామంలో మంగళవారం నాడు క్షీరాభిషేకం చేసిన అనంతరం గ్రామశాఖ అధ్యక్షుడు రొండ్ల గోవర్ధన్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నన్నీ రోజులు మండలంలో స్వేచ్ఛగా మాట్లాడలేని పరిస్థితి లేదన్నారు. నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తామంత ఊపిరి పీల్చుకున్నట్లు ఆయన అన్నారు. కాంగ్రెస్ పాలనలో తామంత స్వేచ్ఛగా మాట్లాడుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు స్వేచ్ఛ కోరుకుంటున్నారని గోవర్ధన్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ సర్పంచ్ ప్యాట్ల లింబాద్రి,మాజీ ఉపసర్పంచ్ బాబుప్రసాద్,నాయకులు రొండ్ల సాయరెడ్డి,పులి రాము,పులి మధు,వినేష్,రాజేశ్వర్,వంశీ,శ్రీకాంత్,నిఖిల్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో ఆధార్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలి

డిచ్‌పల్లి, జనవరి 16: డిచ్‌పల్లి మండల గ్రామాల ప్రజలు ఆధార్ సెంటర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గ్రామాల ప్రజలు 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఇది వరకు డిచ్‌పల్లి మండల కేంద్రంలో పనిచేసిన ఆధార్ సెంటర్ గత 15 రోజుల నుంచి మూసి ఉంచారు. దీంతోతీవ్ర ఇబ్బందులు పడుతున్నారు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి డిచ్‌పల్లి మండలంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.135	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,250	రూ.59,250	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : గుంటూరుకారం (9.20, 12.40, 4.00, 7.20, 10.40)
- స్క్రీన్-2 : హనుమాన్ (9.00, 12.20, 3.40, 7.00, 10.20)
- స్క్రీన్-3 : నా సామిరంగ (9.50) : సలార్ (1.00) : సైందవ్ (4.35, 7.35, 10.35)
- స్క్రీన్-4 : హనుమాన్ (9.50) : నా సామిరంగ (1.05, 4.15, 7.25, 10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : గుంటూరుకారం (10.25, 1.30, 4.35, 7.40, 10.45)
- స్క్రీన్-2 : నా సామిరంగ (10.20) : సైంధవ్ (1.20, 7.45, 10.35)
- స్క్రీన్-3 : హనుమాన్ (10.40, 4.30, 7.40) : నా సామిరంగ (1.45, 10.40)

- దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
- లలితమహాల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : నా సామిరంగ (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : సైంధవ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్